# బలహీనతలు కొనసాగవచ్చు




**సమీక్ష :** దేశీయ మార్కెట్లు గత వారం అధిక ఊగిసలాటకు లోనయ్యాయి. అమెరికాలో రెండో మాంద్యం గురించిన భయాలు, యూరోజోన్ రుణ సంక్షోభ నేపథ్యంలో ఒత్తిడి కొనసాగడంతో ఏడాది కనిష్ఠ స్థాయిలకు దిగజారింది. అమెరికా రేటింగు తగ్గింపు ప్రభావంతో స్థానిక మార్కెట్లూ బలహీనంగా నమోదయ్యాయి. వచ్చే రెండేళ్ల వరకు వడ్డీ రేట్లను సున్నాకు సమీపంలో ఉంచుతామన్న ఫెడరల్ రిజర్వు నిర్ణయంతో ప్రపంచ మార్కెట్లతో పాటు దేశీయ మార్కెట్లూ ఆ తర్వాత లాభాలు అందుకున్నాయి. ఆహార ద్రవ్యోల్బణం ఎగబాకడం, ఐఐపీ గణాంకాలు అనూహ్య స్థాయిలో పెరగడం ఆర్‌బీఐని ఇప్పటి కఠిన వైఖరికే కట్టుబడేటట్లు చేయవచ్చన్న ఆందోళనలతో గురు, శుక్రవారాలు మార్కెట్లు నష్టాల్లోనే నడిచాయి. వారం మొత్తంమీద 466 పాయింట్లు పోగొట్టుకున్న సెన్సెక్స్, చివరకు 16840 వద్ద స్థిరపడింది. విదేశీ సంస్థాగత మదుపు దారులు (ఎఫ్‌ఐఐలు) రూ.4,337 కోట్ల నికర విక్రయాలు చేయగా, మ్యూచువల్ ఫండ్లు రూ.1,655 కోట్ల నికర కొనుగోళ్లు నమోదు చేశాయి.

**రంగాల వారీగా }** అంతర్జాతీయ మందగమనంపై ఆందోళనలు పెరగడంతో ఐటీ, లోహ సూచీల్లో విక్రయాల ఒత్తిడి కనిపించింది. మెరుగైన ఫలితాల నేపథ్యంలో వాహన రంగం లాభాలతో ముగిసింది. మన్నికైన వినిమయ వస్తువులు, ఎఫ్ఎమ్‌సీజీ రంగాలు రాణించాయి.

**లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 5:6గా నమోదవడం బలహీన సంకేతాలున్నట్లు సూచిస్తోంది.**

**ఈవారం అంచనాలు }** వరుసగా మూడో వారమూ మార్కెట్ నష్టపోయింది. 14 వారాల కనిష్ఠానికి దిగజారింది. 16,000 స్థాయి వరకూ బీఎస్ఈ సెన్సెక్స్ దిద్దుబాటు జరగొచ్చన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. మరో పక్క 17358 పైన ముగిస్తే మాత్రం స్వల్ప కాలంలో మార్కెట్లో రికవరీ కనిపించొచ్చు. ప్రస్తుతం దేశీయ మార్కెట్లు బేరిష్ దశలో ఉన్నాయి. ఈ ధోరణి స్వల్ప, మధ్య కాలాలకు కొనసాగవచ్చు.

**ప్రభావిత అంశాలు }** ద్రవ్యోల్బణంపై పెరుగుతున్న ఆందోళన కారణంగా డబ్ల్యూపీఐ, ఆహార ద్రవ్యోల్బణ గణాంకాలను మార్కెట్ సునిశితంగా గమనించొచ్చు. అమెరికా, ఐరోపా మార్కెట్ల పరిణామాలు కూడా గమనించాల్సి ఉంటుంది. ఎఫ్ఐఐల వైఖరి పైనా కన్నేయాల్సి ఉంటుంది. ఎఫ్ఐఐలు విక్రయాల బాటనే నడిస్తే సూచీలు మరింత దిగజారతాయి.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 16684, 16432, 16139
**తక్షణ నిరోధ స్థాయిలు :** 17059, 17358, 17655

**స్థిరమైన మద్దతును పొందే ముందు మార్కెట్ మరింత బలహీనతలకు లోను కావచ్చు.**

*– సతీశ్ కంతేటి, జెన్ మనీ*